RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 323 | బుధవారం | 29 - 05 - 2024 | పేజీలు : 4 | వెల : 5.00

## పాలమూరు వర్శిటీ వీసీ కోసం పోటీ




3

# విస్ఫోటాల అంచున






# రుద్రారం గ్రామం



- గ్యాస్ పైప్ లైన్‌ను ఆనుకొనే భారీ అక్రమ నిర్మాణం
- నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ నిర్మాణాలు
- రుద్రారం చిన్న చెరువు - లకడారం పెద్ద చెరువుకు వెళ్లే గొలుసు కట్టు కాలువ మాయం
- పంట పొలాలు మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం
- వరద ప్రవాహం వెళ్లే దారిలేక జాతీయ రహదారిపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం
- ఇన్ని అడ్డంకులతో నిర్మాణ అనుమతులు ఎలా వచ్చాయి ?
- కాలువ కబ్జా అవుతుంటే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారు ?
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రుద్రారం గ్రామ రైతులు

సంగారెడ్డి – ప్రభాత సూర్యుడు : సుమారు 8 ఫీట్ల లోతు నుండి వెళ్తున్న భారీ రిలయన్స్ గ్యాస్ పైప్ లైన్ ను ఆనుకోని, రుద్రారం చిన్న చెరువు నుండి లకడారం పెద్ద చెరువుకు వెళ్లే ప్రధాన గొలుసు కట్టు కాలువను ఖబ్జా చేస్తూ దాదాపు 2000 గజాల్లో నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున సెల్లార్ నిర్మాణ పనులు జరుగుతున్నా..ఇరిగేషన్ అధికారులు గాని, రెవెన్యూ అధికారులు గాని, అనుమతులిచ్చిన హెచ్ఎండిఏ అధికారులు గాని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ అధికారులకు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండానే ప్రధాన గొలుసుకట్టు కాలువను మాయంచేసి ఇంత పెద్ద అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా ఎలా జరుగు తున్నాయని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2

## ఆగస్టు సంచలనం ఏమిటి..?





హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే తనదైన మార్కు చూపుతున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు సీఎంవో నుంచి, గాంధీ భవన్ నుంచి లీకులు వస్తున్నాయి. దీంతో అందరిలో ఆసక్తి నెలకొంది. ఆగస్టు అంటే

2

## నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై దాడులు



ప్రభాత సూర్యుడు : కరీంనగర్ : ఎలాంటి అనుమతులు లేకుండా మోసాలకు పాల్పడుతున్న నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ మహబూబ్, రుద్రంగి మండలం కేంద్రానికి చెందిన బొండు అంజయ్య, గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ఓరుగంటి రాములు నకిలీ ఏజంట్లుగా గుర్తించారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నకిలీ వీసాలు ఇచ్చి మోసానికి

2

## టార్గెట్ ఉత్తమ్



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : తెలంగాణలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టార్గెట్‌గా సీక్రెట్ ఆపరేషన్ జరుగుతోందా.. ఈ ఆపరేషన్ వెనుక అధికార పార్టీ నేతలే ఉన్నారా అంటే అవుననే అంటున్నారు పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వరుసగా ఉత్తమ్‌పై ఆరోపణలు చేయడమే ఇందుకు కారణం. ఈ ఆరోపణలను ఉత్తమ్ ఖండిస్తున్నా.. ఆయనకు అధికార పార్టీ నుంచి ఎవరూ అండగా నిలవడం లేదు. ధాన్యం కొనుగోళ్లలో

3

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com
www.prabhathasuryudu.com బుధవారం 29 - 05 - 2024



# విస్ఫోటాల అంచున రుద్రారం గ్రామం

## - ప్రధాన గొలుసు కట్టు కాలువ మాయం

సంగారెడ్డి - ప్రభాత సూర్యుడు : సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం రుద్రారం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వ్ నంబర్ 723/2 లో ముంబాయి జాతీయ రహదారిని ఆనుకొని సుమారు రెండు వేల గజాలాల్లో నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణాలను చేపట్టారు. ఆ నిర్మాణాల్లో రుద్రారం చిన్న చెరువు నుండి లకడారం పెద్ద చెరువుకు వెళ్లే ప్రధాన గొలుసు కట్టు కాలువ పూర్తిగా కనుమరుగు కానుంది. కాలువ కబ్జాతో రుద్రారం, లకడారం గ్రామ ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కాలువ గుండా వెళ్ళవలసిన వరద నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి ముంబాయి జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనదారుల రాకపోకలు నిలిచిపోయి తీవ్ర అంతరాయం జరుగుతుంది. ప్రధానంగా రైతుల పంటపొలాలు మునిగిపోతాయి. చెరువుల్లోని నీరు చేరక మత్స్యకారులకు నష్టం జరిగే ప్రమాదం ఉంది.



### - పొంచి ఉన్న విస్ఫోటం..?

గొలుసు కట్టు కాలువను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాల గుండానే రిలయన్స్ కంపెనీకి చెందిన భారీ గ్యాస్ పైప్ లైన్ 8 ఫీట్ల లోతు నుండి వెళుతుంది. గ్యాస్ పైప్ లైన్లో ఏవైనా అవాంతరాలు ఏర్పడి అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. అదే గనుక జరిగి భారీ విస్ఫోటాలు జరిగితే నివాస ప్రాంత ప్రజలకు ప్రాణ నష్టం జరుగుతుంది.

### - రైతులకు, మత్స్యకారులకు తీవ్ర నష్టం

ఇరు గ్రామాలకు అనుసంధానంగా ఉన్నటువంటి గొలుసు కట్టు కాలువ కబ్జాకు గురి కావడం వల్ల వరద నీరు వెళ్లే పరిస్థితి లేక పంట పొలాలు మునిపోతాయి. చెరువుల్లోకి నీరు చేరక మత్స్యకారుల మనుగడ దెబ్బ తింటుంది. జాతీయ రహదారిపై నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం వాటిల్లే ప్రమాదం ఉంది.

### - అనుమతులు ఎలా వచ్చాయి ?

నిబంధనలకు విరుద్ధంగా నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్టుకు నిర్మాణ అనుమతులు ఏవిధంగా వచ్చాయని పలు సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. కాలువ ఆయకట్టు గుండా, గ్యాస్ పైప్ లైన్ వెళ్లే మార్గంలో హెచ్ఎండిఏ అధికారులు నిర్మాణానికి అనుమతులు ఎలా ఇస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్థానికి గ్రామ పంచాయతీ, ఇరిగేషన్ అధికారుల అండదండలతోనే అనుమతులు పొందారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### - కాలువను కాపాడాలని రైతుల ఆవేదన

జాతీయ రహదారి నుండి గొలుసు కట్టు కాలువ ఉన్నదని, ఎన్నో ఏళ్లు గా వర్షపు వరద నీరు సాఫీగా లకడారం పెద్ద చెరువులో కలుస్తుందని అన్నారు. వాగును పూడ్చేస్తూ భారీ అక్రమ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే వెనక ఉన్న తమ పొలంలోకి వరద నీరు తిరిగి వెనకకు వచ్చి పంట పొలాలు మునిపోతాయని ఆవేదన వ్యక్తం చేసారు. వాగును కబ్జా చేసి నిర్మాణాలు చేయడం భూములు కొనేందుకు ఎవ్వరు కూడా ముందుకు రావడం లేదని, తద్వారా భూముల ధరలు తగ్గి నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ అక్రమ నిర్మాణ కట్టడాలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని తమకు న్యాయం చేయాలని వరద నీరు వెళ్లే గొలుసు కట్టు వాగును కాపాడాలని రుద్రారం గ్రామ రైతులు మంగలి రామయ్య, యాదగిరి, శంకరయ్య, సత్తయ్య, వెంకన్న, రామ్ రెడ్డి, విష్ణువర్ధన్ తదితరులు డిమాండ్ చేశారు.



రుద్రారం జాతీయ రహదారి నుండి లకడారం పెద్ద చెరువు లోకి వరద నీరు వెళ్లే "గొలుసు కట్టు కాలువ"ను కబ్జా చేసి భారీ నిర్మాణం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇరిగేషన్ శాఖ నుండి అనుమతులు లేకుండా భారీ నిర్మాణం చేయడం నేరమని అన్నారు. వెంటనే అట్టి నిర్మాణ పనులను ఆపుతున్నామని, తమ ఆదేశాలను అతిక్రమించి నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరించారు.

- రంగా రావు, తహసీల్దార్, పటాన్ చెరు

గొలుసు కట్టు కాలువను కబ్జా చేసి అక్రమంగా భారీ నిర్మాణం చేస్తున్న అంశాన్ని 'ప్రభాత సూర్యుడు' ప్రతినిధి ప్రస్తావించగా.. ఈ విషయం తమకు తెలిసిందని, వెంటనే సిబ్బందిని పంపి నిర్మాణపనులు నిలిపివేయిస్తామని అన్నారు. ఇరిగేషన్ శాఖ నుండి ఎటువంటి ఎన్ ఓ సి అనుమతులు లేవని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి అట్టి అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని, జాతీయ రహదారి నుండి లకడారం పెద్ద చెరువుకు వెళ్లే "గొలుసు కట్టు కాలువ"ను కాపాడుతామని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే ఎంత పెద్ద వారైనా శిక్షార్హులేనని హెచ్చరించారు.

- మధుసూదన్ రెడ్డి, ఈ ఈ , జిల్లా ఇరిగేషన్ అధికారి, సంగారెడ్డి

పటాన్ చెరువు మండలం రుద్రారం గ్రామ జాతీయ రహదారి నుండి గొలుసు కట్టు వాగు పై తమ శాఖ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, జిల్లా ఈఈ మధుసూదన్ రెడ్డి ఆదేశాలతో అక్రమ నిర్మాణాలను పరిశీలించినట్లు తెలిపారు. తమ శాఖ నుండి ఎటువంటి ఎన్ ఓ సి అనుమతులు లేవని అన్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని, అక్రమ నిర్మాణ పనులను వెంటనే ఆపుతున్నట్లు తెలిపారు.

- చక్రవర్తి, ఏఈ, మండల ఇరిగేషన్ అధికారి, పటాన్ చెరు

హెచ్ఎండిఏ నుండి అనుమతులు ఉన్నట్టు చూపించారని, కానీ అందులో ఇరిగేషన్ శాఖ నుండి ఎన్ ఓ సి అనుమతి పేపర్లు లేవని అన్నారు. రుద్రారం జాతీయ రహదారి నుంచి లకడారం పెద్ద చెరువుకు వరద నీరు వెళ్లే గొలుసు కట్టు వాగుపై ఏ నిర్మాణాలు జరిగిన నేరమని అన్నారు. ఎటువంటి నిర్మాణాలు చేసిన ఇరిగేషన్ శాఖ అనుమతులు తప్పనిసరి అని అన్నారు. రెవిన్యూ శాఖ, ఇరిగేషన్ శాఖ ల అధికారుల ఆదేశాలతో సమన్వయం చేసుకుని అక్రమ కట్టడాలను నిలిపివేస్తామని తెలిపారు.

-రాజ్ కుమార్ , ఈ ఓ, రుద్రారం గ్రామ పంచాయతీ

# నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై దాడులు

మొదటిపేజీ తరువాయి

పాల్పడుతున్నారని తెలిపారు.ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్ళే వారికి నకిలీ విసాలు అంటగట్టి అందినకాడికి దోచుకుని మోసానికి పాల్పడే వారు చాలా మంది ఉన్నారని ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 19 మందిని గుర్తించి కేసులు నమోదు చేశామని ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు.నకిలీ గల్ఫ్ ఎజెంట్స్ విజిట్ వీసాల పై జిల్లాలో ఉన్న నిరుద్యోగులని టార్గెట్ చేసి వారి నుండి అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని మాయ మాటలు చెప్పి గల్ఫ్ దేశాలకి పంపిస్తారని చెప్పారు. అక్కడికి వెళ్ళిన తరువాత కంపెనీ వీసా కాదని తెలిసి దేశం కానీ దేశంలో ఎం చేయాలో తెలియక అష్ట కష్టాలు పడి స్వదేశానికి తిరుగు ప్రయాణం అవడం లేదా అక్కడే ఏదో చిన్న చితక కూలి పని చేసుకోవడం వంటివి జరుగుతునాయని తెలిపారు.ఎవరైతే ఏజెన్సీల లేదా ఏజెంట్ల చేతిలో మోసపోయారో వారు నేరుగా పోలిసులకు పిర్యాదు చేస్తే ఆ పిర్యాదు పై తగిన రీతిలో విచారణ జరిపి నేరం రుజువు అయితే సదరు ఏజెంట్ పై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో గత సంవత్సరం 43 కేసులు నమోదు కాగ, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 19 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ వీసాలు ఇచ్చి మోసం చేసే వారి ఏజెన్సీ రద్దు కు సిఫారసు చేయడం తో పాటు వారిపై ఖఆ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్ళాలనుకునే వారు లైసెన్స్ కలిగి ఉన్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించాలని కోరారు.నకిలీ ఏజంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకోడానికి పోలీస్ శాఖ వారిని సంప్రదించవచ్చని సూచించారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారు.. విదేశాలకు పంపిస్తానని డబ్బులు తీసుకొని , పాస్ ఫోర్ట్ తీసుకుని పంపకుండా మోసం చేసిన , నకిలీ గల్ఫ్ ఏజెంట్ల కి సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు అందించాలని కోరారు.జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేకమైన చర్యల నివారణ కోసం ప్రముఖ పుణ్యక్షేత్రం వేముల వాడలో పలు లాడ్జిలు, హోటల్స్ పై పోలీసులు దాడులు నిర్వహించారు. లాడ్జిలలో బసకోసం వచ్చే వారి ఆధార్ కార్డు లు, ఇతర ఐడెంటిటీ కార్డులు పరిశీలించారు.లాడ్జిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవలని లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని లాడ్జీల నిర్వాహకులను హెచ్చరించారు. ఎవరైన కొత్తవారు, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమచారం ఇవ్వాలని సూచించారు.

# ఆగస్టు సంచలనం ఏమిటి..?

మొదటిపేజీ తరువాయి

తెలుగు రాష్ట్రంలో సంక్షోభం గుర్తొస్తుందని, ముఖ్యంగా టీడీపీకి ఇది ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో రేవంత్ ఆగస్టు సంచలనం ఏమిటా అని అంతా ఆరా తీస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రారంభించిన పథకాలు ఇప్పటికీ అమలవుతు న్నాయి. వాటిలో కొన్నింటిని ఆగస్టులో పక్కన పెట్టాలని రేవంత్ భావిస్తున్నారు. కొన్నింటి పేర్లు మారుస్తారని తెలుస్తోంది. కొన్ని కొత్త పథకాలు ప్రారంభిస్తారని భావిస్తున్నారు. ఈమేరకు సీఎం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. రైతుబంధును రైతుభరోసాగా, ఆసరా పెన్షన్‌ను చేయూతగా ఇలా మొత్తం 12 పాలసీలకు సంబంధించి మార్పులు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం ప్రారంభించి నిధులు విడుదల చేయలేద. దీంతో కాంగ్రెస్ సర్కార్ దాని స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు అనే కొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. తాజాగా టీఎస్ ఐపాస్ పాలసీలో విప్లవాత్మమైన మార్పులు తీసుకొచ్చారు. కేటీఆర్ గొప్పగా చెప్పుకున్న పాలసీని సైతం మార్చాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఒక్క పాలసీలో ఆరు పాలసీలు వస్తాయని ఆమేరకు విధి విధానాలు రూపొందించాలని అధికారులకు సూచించారు.ఇక ఆగస్టులోనే జిల్లాల పునర్వ్యవస్థీకరణపైనా కమిటీ ఏర్పాట చేసే అవకాశం ఉంది. మండలాల్లోని గ్రామాలను కూడా సర్దుబాటు చేస్తారని తెలుస్తోంది. 33 జిల్లాలను 17 జిల్లాలకు కుదించేందుకు కమిటీ వేసి ఆ కమిటీ సూచనల మేరకు మార్పులు చేపట్టే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.





# పనసకాయల మాటున గంజాయి

ఏలూరు, ప్రభాత సూర్యుడు : నిజంగా పుష్ప సీనే. అది పనసకాయలు తరలిస్తున్న వాహనం. చూసే వారికి అది ఫ్రూట్స్ ట్రాన్స్‌పోర్ట్ చేసే వాహనంగానే కనిపిస్తోంది. కాని కింది భాగం తెరిచే చూస్తే మాత్రం దాని వెనకాల అసలు రంగుబయట పడుతుంది. పనసకాయల మాటున గంజాయి తరలిస్తున్న నిందితుల ఆపరేషన్ ఇది. అశ్వారావుపేటలో పనసకాయల లోడ్‌లో దాచి అక్రమంగా తరలిస్తున్న గంజా యిని భద్రాద్రి కొత్తగూడెం పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి హైదరాబాద్‌కు మినీ ప్యాసింజర్ వాహనంలో 359 కిలోల బరువున్న 89 లక్షలకు పైగా విలువైన గంజాయిని అక్రమంగా తరలిసు_న్న నలుగురు వ్యక్తులను కొత్తగూడెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనం కింది భాగంలో ఓ బాక్సును ఏర్పాటు చేసుకుని కొన్ని రోజులుగా ఈ ముఠా గంజాయి తరలిస్తు_న్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా వాహనాన్ని చెకింగ్ చేయగా వాహనం కింది భాగంలో 359 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులను అదుపులోకి తీసుకున్న తీసుకున్న పోలీసులు.. వారికున్న లింకులపై కూపీ లాగుతు న్నారు.మరో కేసులో భద్రాచలం వద్ద ప్లైవుడ్ షీట్ల కింద దాచి ఉంచిన 427 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, డ్రగ్స్ తరలి స్తున్న ఏడుగురిని అరెస్టు చేశారు. నిందితులు తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌లోని మూసాపేటకు గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
www.prabhathasuryudu.com

# టార్గెట్ ఉత్తమ్



మొదటిపేజీ తరువాయి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఇందుకు ఆధారాలు కూడా తన వద్ద ఉన్నాయని తెలిపారు. సోమవారం బయటపెడతానని కూడా ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా తెలంగాణ దృష్టి ఉత్తమ్‌పై పడింది. ఇప్పటికే యూ ట్యాక్స్ అంటూ మహేశ్వర్‌రెడ్డి ఇటీవల ఉత్తమ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేసులో ఉన్నాననిపించుకునేందుకు ఉత్తమ్ కాంగ్రెస్ అధిష్టానానికి కోట్ల రూపాయలు పంపించాడని ఆరోపించారు. ఒకవైపు మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలపై చర్చ జరుగుతుండగానే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కూడా ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని టార్గెట్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఉత్తమ్ రూ.1,100 కోట్ల స్కామ్ చేశారని ఆరోపించారు. ఒకవైపు మహేశ్వర్‌రెడ్డి ఆధారాలు బయట పెట్టకముందే.. ఆ క్రెడిట్ బీజేపీ ఖాతాలో పడకుండా ఉండేందుకు కేటీఆర్ రంగంలోకి దిగారు. పక్కా లెక్కతో ఆరోపణ చేశారు. బ్లాక్ లిస్టులో ఉంచిన కేంద్రీయ భండార్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది కూడా జేబులు నింపుకోవడానికే అని ఆరోపించారు.ఆరోపణలు ఎలా ఉన్నా.. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఎలాంటి ఆధారాలు బయటపెడతారు అన్నది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. నిజంగా ఆధారాలు ఉన్నాయా అన్న చర్చ జరుగుతోంది. పౌరసరఫరాల శాఖలో అవతకవకలు జరిగాయని మహేశ్వర్‌రెడ్డి పేర్కొంటున్నారు. మరోవైపు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిజంగానే అవినీతికి పాల్పడ్డారా లేదంటే సివిల్ సప్లయ్ అధికారులే ఉత్తమ్ కళ్లుగప్పి అవినీతి చేశారా అన్న చర్చ జరుగుతోంది. మొత్తగా ఉత్తమ్ లక్ష్యంగా ఏదైనా సీక్రెట్ ఆపరేషన్ జరుగుతుందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.ఆరోపణలు ఎలా ఉన్నా.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. అధికార పార్టీని కాదని పౌర సరఫరాల శాఖలో అవినీతికి సంబంధించిన ఆధారాలు విపక్ష బీఆర్ఎస్, బీజేపీ ఎవరు ఇచ్చారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీలోనే ఉత్తమ్‌కు వ్యతిరేకంగా ఎవరైనా పావులు కదుపుతున్నారా అన్న చర్చ జోరుగా జరుగుతోంది.

# గులాబీ నేతల వ్యూహాత్మక మౌనమేనా

ప్రభాత సూర్యుడు : కరీంనగర్, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తరువాత.. బీఆర్ఎస్‌లో సైలెంట్ కనబడుతుంది. ఎక్కడా హడావిడి కనబడటం లేదు. నేతలు కూడా.. ఎన్నికల పోలింగ్ గురించి పెద్దగా చర్చించడం లేదు. అయితే, రెండు నియోజకవర్గాలు మినహా మిగతా ఐదు నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇవ్వలేమన్న భావన కనబడుతుంది. దీంతో ఇక్కడ ఫలితం ఏ విధంగా వస్తుందో ఉత్కంఠ నేతల్లో కనబడుతుంది. కరీంనగర్ పరిధిలో బీఆర్ఎస్ అవిర్భావం నుంచి 2018 ఎన్నికల వరకు హడావిడి కనిబడింది. కానీ 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్?కి ఉహించని షాక్ తగిలింది. అప్పటి నుంచి వరుసగా అనుకున్న స్థాయిలో ఫలితాలు రావడం లేదు అసెంబ్లీ ఎన్నికల్లో కూడా గట్టి షాక్ తగిలింది. అయితే, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటిందుకు ప్రయత్నం చేసింది. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి వినోద్ కుమార్ బరిలోకి దిగారు. రెండు నెలల పాటు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఖచ్చితంగా గెలువలనే పట్టుదలతో ముందుకు సాగారు. బిజేపీ నుంచి బండి సంజయ్, కాంగ్రెస్ నుంచి రాజేందర్రావు పోటీ చేశారు. అయితే పోలింగ్ తమకు అనుకూలంగా లేదని నేతల్లో చర్చ సాగినట్లు తెలుస్తోంది. దీంతో ముఖ్య నేతలు ఈ విషయం గురించి పెద్దగా చర్చించడంలేదు. వినోద్ కుమార్ కూడా పూర్తిగా పోలింగ్‌పై సమీక్ష నిర్వహించేందుకు విముఖత చూపినట్లు తెలుస్తోంది. ఈ నియోజకవర్గంలో ముగ్గురు ఎమ్మెల్యేలు.. బలమైన నేతలు ఉన్నప్పటికీ గట్టిగా పోటీ ఇవ్వలేకపోయామనే భావన వ్యక్తమైంది.కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ స్థానాలు ఉంటే.. సిరిసిల్ల, హుజురాబాద్ నియోజకవర్గాల్లోనే, బీఆర్ఎస్‌కి అనుకూలంగా ఓట్లు పడ్డాయి. మిగతా ఐదు నియోజకవర్గాల్లో ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదని తెలుస్తోంది. ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో బీఆర్ఎస్ ఏ మాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. కరీంనగర్ అసెంబ్లీలో కూడా అనుకున్న స్థాయిలో ఓట్లు బీఆర్ఎస్‌కి రాలేదనే చర్చ సాగింది. పోలింగ్‌కు ముందు చొప్పదండి, సిరిసిల్ల, హుస్నాబాద్, మానకొండూరు, హంజారాబాద్లో మెజారిటి ఓట్లు వస్తాయని నేతలు భావించారు. అందుకు విరుద్ధంగా పోలీంగ్ సరళి కనబడింది. హుస్నాబాద్లో, కాంగ్రెస్, బిజెపీ మధ్యనే గట్టి పోటీ నెలకొంది. అదే విధంగా, మానకొండూరు, చొప్పదండిలో బిజేపీ, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోరు కనబడింది. దీంతో అనుకున్న స్థాయిలో బీఆర్ఎస్?కు ఓట్లు రాలేదని నేతల్లో అభిప్రాయం ఏర్పాడినట్లు చర్చ జరుగుతోంది.




దీంతో ఎన్నికల తర్వాత నుంచి ముఖ్య నేతలంతా సైలెంట్ ఆయ్యారు. అయితే సైలెంట్ ఓట్లు తమను గట్టెక్కిస్తాయనే ధీమాతో ఉన్నారు. వినోద్ కుమార్ కూడా మీడియా చిట్ చాట్?లో మోదీ వేవ్ కనబడిందని ప్రస్తావించారు. అయితే పోరాటం చేసే బీఆర్ఎస్‌కి ప్రజల మద్దతు ఉందని చెబుతున్నారు. ఇక్కడ త్రిముఖ పోరు ఉండటంతో తమకే లాభం జరుగుతుందని బీఆర్ఎస్ నేతలు ధీమాతో ఉన్నారు. అయితే క్షేత్ర స్థాయిలో నివేదికలు ప్రతికూలంగా ఉన్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో 7 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వైపు బలంగా ఉన్న సమయంలోనే వినోద్ కుమార్ ఓడిపోయారు. ప్రస్తుతం ఉన్న ప్రతికూల పరిస్థితిల్లో ఎలాంటి ఫలితం వస్తుందనే ఉత్కంఠ నేతల్లో కనిపిస్తోంది.

# పాలమూరు వర్శిటీ వీసీ కోసం పోటీ

మహబూబ్ నగర్, ప్రభాత సూర్యుడు : ఒక్క వీసీ పోస్టు.. వందకుపైగా అప్లికేషన్లు. అవును వినడానికి కొంత వింతగా ఉన్నా ఇది వాస్తవం. అసలే కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.100కోట్ల నిధులు వచ్చాయి. దానికి తోడు సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోని యూనివర్సిటీ. ఇంకేముంది ఎన్నడూ లేని విధంగా యూనివర్సి టీ వీసీ పోస్టుకు తెగ డిమాండ్ ఏర్పడింది. పాలమూరు యూనివర్సిటీ వీసి పోస్ట్?కి తీవ్ర పోటీ నెలకొంది. రాష్ట్రంలోనే అత్యధిక అప్లికేషన్?లు వచ్చిన వర్సిటిల్లో మూడో స్థాన ంలో ఉంది పీయూ. ముఖ్యమంత్రి సొంత జిల్లా కావడం, ఇటీవలే వందకోట్ల నిధులు రాకతో ఈ పోస్ట్?కి డిమాండ్ మరింత పెరిగింది. ఇక పోస్టు కోసం పొలిటికల్ రెఫరెన్స్?ల కోసం నేతల చుట్టూ ఆశావహులు చక్కర్లు కొడుతు న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పోస్టుల నియామకాల ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులైన వారందరూ వీసీ పోస్టులకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. మహబూబ్?నగర్ జిల్లాలోని పాలమూరు విశ్వవిద్యాలయం పోస్ట్?కు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ తరువాత అత్యధికంగా పాలమూరు యూనివర్సిటీ వీసీ పోస్టుకే అప్లికేషన్?లు వచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే యూనివర్సిటీ ఉండటంతో మరింత ప్రాధాన్యం పెరిగింది. అయితే ఈ సారి పోటీ ఎక్కువగా ఉండటంతో వీసి పదవీ ఎవరిని వరిస్తుందో అనే చర్చ జోరుగా సాగుతోంది. వీసి నియామకంలో గతం నుండే రాజకీయ ప్రమేయం కీలకంగా ఉంది. చాలావరకు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నవారికే పదవీ దక్కుతుందని టాక్ నడుస్తోంది. ఈ కారణంగా ఆశావాహులు అధికార పార్టీ నేతలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పాలమూరు యూనివర్సిటీ ప్రస్తుత వీసి ప్రొఫెసర్ ఎల్ బి లక్ష్మి కాంత్ రాథోడ్ పదవీకాలం ఇటీవలే ముగిసింది. దీంతో వీసి పదవికి అర్హులైన వారు 159 మంది దరఖాస్తు చేసుకున్నారు.ప్రొఫెసర్?గా పదేళ్ళ అనుభవం.. ఎలాంటి వయో పరిమితి లేకపోవడంతో ఎక్కువ మంది అప్లై చేసుకున్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్స్, పీయూలో రిజిస్ట్రార్?గా పని చేసి ఇతర




వర్సిటీలకు బదిలీపై వెళ్లిన వారు దరఖాస్తు చేశారు. అయితే ఈసారి వడపోత చాలా కఠినంగా ఉంటుందనే చర్చ సాగుతోంది. సీఎం సొంత జిల్లా కావడంతో పీయూపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లుగా సమాచారం. ప్రస్తుత వీసి కూడా మరోసారి అవకాశం కోసం ప్రయత్నం చేస్తున్నారట. ఆయన హాయంలోనే వందకోట్ల నిధులు మంజూరు కావడం, సీఎం నియోజకవర్గంకు సంబంధించిన వ్యక్తి కావడం, అధికార పార్టీ నేతల ఆశీస్సులు ఉన్నాయనే చర్చ కూడా నడుస్తోంది. ఏది ఏమైనా రాజకీయ ప్రమేయం లేకుండా విద్యార్థులకు మంచి సేవలు అందించే వారికే వీసీగా అవకాశం ఇవ్వాలని విద్యార్థులు, జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# ఇండియా కూటమి వస్తే పండుగే

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని ఆ పార్టీ నేతలు కొన్ని రోజులుగా ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఇప్పటి వరకు జరిగిన ఐదు విడతల పోలింగ్ సరళిని లెక్కలు వేసుకుంటూ కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వస్తాయో ఓ అంచనాకు వస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల ప్రకారం.. కాంగ్రెస్ ఒంటరిగా 150 సీట్లు గెలుస్తుందని రాహుల్‌గాంధీ ప్రకటించారు. మరో 150 సీట్లు మిత్ర పక్షాలకు వస్తాయని అంటున్నారు. దీంతో కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ అంచనాలు రోజు రోజుకూ పెరుగుతుండడంతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిలో జోష్ కూడా క్రమంగా పెరుగుతోంది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారం చేపడితే తనకు తిరుగు ఉండదన్న భావనలో ఉన్నారు రేవంత్. ఈ విషయాన్ని ఇప్పటికే ఆయన తన సన్నిహితుల వద్ద పదేపదే చెబుతున్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నది కేవలం మూడు రాష్ట్రాల్లోనే. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో ఆ పార్టీ ప్రభుత్వాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల ఖర్చులకు ఈ రాష్ట్రాల నుంచే భారీగా నిధులు కాంగ్రెస్‌కు అందుతున్నాయి. రేవంత్‌రెడ్డి అయితే అధిష్టానం వద్ద మంచి మార్కులు కొట్టేసేందుకు మిగతా రాష్ట్రాలకన్నా ఎక్కువ నిధులు సమకూరుస్తున్నారని ప్రచారం జరుగుతోంది.తెలంగాణలో ఐదేళ్లు సీఎంగా రేవంత్ ఉంటారన్న భరోసా అయితే అధిష్టానం ఇచ్చింది. అయితే రేవంత్ మాత్రం పదేళ్లు తానే ముఖ్యమంత్రి అని ఇటీవల ప్రకటించారు. తన ప్రభుత్వాన్ని ఎవరూ టచ్ చేయలేరని హెచ్చరించారు. దీని వెనుక పెద్ద కారణమే ఉందని తెలుస్తోంది. కాంగ్రెస్‌కు రాష్ట్రం నుంచి భారీగా నిధులు సమకూర్చుకుంటూ పార్టీలో పట్టు పెంచుకుంటున్న రేవంత్.. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలిస్తే మరింత పట్టు సాధించాలని భావిస్తున్నారు. తద్వారా ఇప్పటికీ సీఎం పదవి ఆవిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టివిక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి వారికి చెక్ పెట్టాలన్న ఆలోచనలో ఉన్నారు. పదేళ్లు తన సీటు ఖాయం చేసుకోవచ్చని అంచనా వేస్తున్నారు. మరోవైపు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అప్పులన్నీ తీరుతాయని, సంక్షేమ పథకాలకు భారీగా నిధులు వస్తాయని భావిస్తున్నారు. అందుకే కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాలని ఆశిస్తున్నారు. దీనికోసం తెలంగాణ నుంచి అధిక స్థానాలు ఇవ్వడానికి సర్వశక్తులు ఒడ్డారు. కానీ, ఆశించిన ఫలితాలు రావని ఇప్పటికే టీపీసీసీ ఓ అంచనాకు వచ్చింది. అయినా కేంద్రంలో కాంగ్రెస్ వస్తుందని రాహుల్ ప్రకటించడం సీఎం రేవంత్‌కు ఉత్సాహాన్ని ఇచ్చింది.

# ఆగని అక్రమ రేషన్ బియ్యం రవాణా

వరంగల్, ప్రభాత సూర్యుడు : ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే దందా ఆగడం లేదు. పోలీసులు ఎన్ని కేసులు పెట్టిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అక్రమార్కులు దొడ్డి దారిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారు. రోజుకో చోట బియ్యం పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా రామగుండం టాస్క్ ఫోర్స్ పోలీసులు బారీ మొత్తంలో 260 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సుమారు 8 లక్షల రూపాయల విలువచేసే రేషన్ బియ్యంతోపాటు ఐచర్ డిసిఎం వ్యాన్ ను సీజ్ చేశారు. ఇద్దరిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.జగిత్యాల నుంచి మహారాష్ట్ర కు బియ్యాన్ని వ్యాన్ లో తరలిస్తున్న డ్రైవర్ మహుముద్ అలీ అరెస్టు చేశారు. బియ్యం తరలించే అసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన షంశీర్ పై కేసు నమోదు చేశారు.రామగుండం కమిషనరేట్ పరిధిలోని మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్ గేట్ వద్ద టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా ఐచర్ వ్యాన్ లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడ్డాయని రామగుండం సిపి ఎం.శ్రీనివాస్ తెలిపారు.అనుమానస్పదంగా వెళ్ళున్న వ్యాన్ ను తనికీ చేయగా 150 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టుబడ్డాయని చెప్పారు. వ్యాన్ డ్రైవర్ మహుముద్ అలీ ని అదుపులోకి తీసుకుని విచారించగా ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన షనీశీర్ జగిత్యాల జిల్లాలో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి మహారాష్ట్ర కు తరలిస్తున్నాడని తెలిపారు. ప్రస్తుతం డ్రైవర్ ను అరెస్టు చేయగా బియ్యం అక్రమంగా తరలించే షంశీర్ పరారీలో ఉన్నాడు.అదే విధంగా పెద్దపల్లి జిల్లా ధర్మారం చుట్టుపక్కల గ్రామాల నుంచి దుదని తుఫాన్ సింగ్, చింతల సంపత్ సేకరించి అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసిన 110 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు గుర్తించారు. దుదాని తుఫాన్ సింగ్ అరెస్టు కాగా చింతల సంపత్ పరారీలో ఉన్నాడని సిపి తెలిపారు.రేషన్ బియ్యంతోపాటు ఎలాంటి అక్రమ దందాలకు పాల్పడే వారిపై పిడి యాక్టుతోపాటు కఠిన చర్యలు చేపడుతామని రామగుండం సిపి శ్రీనివాస్ హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపైనా, అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారి పైన నిఘా పెట్టామని తెలిపారు.అక్రమ దందాలు చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నకిలీ పత్తి విత్తనాలు, జీరో వ్యాపారాలు, అక్రమ భూదందాలు భూకబ్జాలు, నకిలీ వ్యాపారాలు, జాబ్ ఫ్రాడింగ్ , ఇసుక, బొగ్గు అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్ ,గేమింగ్ ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.వరుస దాడులు నిర్వహించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com
బుధవారం 29 - 05 - 2024


ఎడిటోరియల్ EDITORIAL

### ఇప్పుడు కాకపోతే..

# ఇంకెప్పుడు కాదు

ప్రభాత సూర్యుడు, డెస్క్ : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ కొట్టేందుకు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కమలం పార్టీ ప్రయత్నిస్తోంది. పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న హస్తం పార్టీ 'ఇప్పుడు కాకపోతే..ఇంకెప్పుడు కాదు ' అన్న రీతిలో ఈ ఎన్నికల్లో పోరాడుతోంది. దేశంలోని 543 పార్లమెంట్ సీట్లకు గాను అధికారంలోకి రావాలంటే ఏ పార్టీ అయినా.. పార్టీల కూటమి అయినా 272 సీట్లు గెల్చుకోవాలి. అయితే ఈ దఫా 400 సీట్లే లక్ష్యమని బీజేపీ చెబుతూ తమ పార్టీ శ్రేణులను ముందుకు కదిలిస్తుంటే, ఇండియా కూటమిదే అధికారం అంటూ కాంగ్రెస్ ఎన్నికల కదనరంగంలో సాగుతోంది.పదేళ్ల పాలన తర్వాత మోదీ సర్కార్‌కు ఇక్కడ కేసీఆర్ ప్రభుత్వానికి వచ్చిన రీతిలోనే వ్యతిరేకత రాక తప్పదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల వంటి అంశాలపై మధ్య తరగతి, సామాన్యుడి ఆగ్రహం తప్పదు. ఈ వ్యతిరేకతను అధిగమించేందుకే మోదీ సర్కార్.. రామ మందిరం వంటి భావోద్వేగ అంశాన్ని విస్తృతంగా ఈ ఎన్నికల్లో తమ పాశుపతాస్త్రంగా వాడుతోంది. అంతేకాకుండా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తిరిగి రామమందిరం కూలడం ఖాయమని బెదిరింపు ధోరణితో ఓటర్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. దీంతో పాటు ఉమ్మడి సివిల్ కోడ్, 370 ఆర్టికల్ రద్దు, సర్జికల్ స్ట్రైక్, పీవోకేను కలుపుకోవడం ఖాయం అని పాజిటివ్ ప్రచారం చేస్తూనే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కాశ్మీర్ సమస్య తిరిగి రవులుకోవడం ఖాయమని, పాకిస్థాన్, చైనాలకు రాహుల్ మిత్రుడని అభివర్ణించే ప్రయత్నం చేస్తోంది. ఇదంతా దేశంలో ఉన్న ఇతర సమస్యలను ఈ భావోద్వేగ ప్రచారం వెనుక అణగదొక్కడమే కమలనాథుల వ్యూహాత్మక ప్రయత్నం. అయితే బీజేపీ అనుకున్నంతగా ఈ ఎన్నికల ఫలితాలు ఉండవని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 303 సీట్లను గెల్చుకుని మిత్రపక్షాలతో కలిసి ఎన్డీఏ సర్కార్ ఏర్పాటు చేసింది. అదే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం 52 స్థానాలకే పరిమితం అయింది. అయితే ఈ దఫాఎన్డీఏ సర్కార్ 400 మార్కు చేరుకోవాలని బీజేపీ నేతలు నిర్దేశించుకున్నా... గత ఎన్నికల్లో గెల్చుకున్న 303 సీట్లను నిలుపుకు ంటుందా అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. గత ఎన్నికల్లో పాకిస్థాన్‌పై సర్జికల్ స్ట్రైక్ అనే అంశం కాంగ్రెస్, బీజేపీల మధ్య అతి పెద్ద వ్యత్యాసానికి కారణంగా దేశ రాజకీయాలను పరిశీలించే విశ్లేషకులు చెబుతారు. ఈ అంశం బీజేపీపై నమ్మకాన్ని, పాకిస్థాన్ విషయంలో చూపుతున్న మోదీ సర్కార్ చూపుతున్న ధృడ వైఖరికి మద్దతుగా ప్రజలపై పనిచేసిందని విశ్లేషిస్తారు. ఈ ఎన్నికల్లో అదే రీతిలో రామమందిర నిర్మాణం, 370 ఆర్టికల్ వంటివి ఉపయోగపడతాయన్నది కమలనాథుల విశ్వాసం. అయితే ఆయా రాష్ట్రాల్లో బీజేపీ పరిస్థితి చూస్తుంటే 303 సీట్లు తిరిగి పొందగలదా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో అధికారం దక్కించుకున్నా, కర్ణాటకల, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో అధికారం కోల్పోవడం కొంత మేర ఆ పార్టీ దూకుడుకు అడ్డుపడిందనే చెప్పాలి. ఉత్తరాదిన ఇలా ఉంటే దక్షిణాదిన బీజేపీకి బలం లేదు. ఉన్న కర్ణాటక రాష్ట్రంలో అధికారం కోల్పోయింది. కేరళ, తమిళనాడులో బలం లేదు. బలమైన మిత్రపక్షాలు లేవు.తెలంగాణలో 17 స్థానాల్లో సింగిల్ డిజిట్ స్థానాలు బీజేపీ గెల్చుకోవచ్చునేమో గాని డబుల్ డిజిట్ గెల్చుకోవడం అంత సులువేమీ కాదు. ఏపీలో జనసేన, టీడీపీలతో బీజేపీ జట్టు కట్టి పోటీ చేయడం కొంత ఊరటనిచ్చేలా కొన్ని స్థానాలు గెలిచినా.. దక్షిణాదిన మాత్రం అనుకున్న రీతిలో కమలం పార్టీ పార్లమెంట్ స్థానాలు గెలిచే అవకాశం లేదని దక్షిణాది రాష్ట్రాల రాజకీయ నిపుణులు చెబుతున్నారు. అసలు బీజేపీ దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి పెట్టడానికి కారణం ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయన్న భయంతోనే అని చెబుతున్నారు. ఉత్తర భారతంలో తగ్గే సీట్లను దక్షిణ భారత రాష్ట్రాల నుంచి గెల్చుకోవడం ద్వారా భర్తీ చేయవచ్చన్న వ్యూహం అమలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే ఈ వ్యూహం అనుకున్నం తగా ఇక్కడ అమలయ్యే పరిస్థితి లేదన్న వాదన వినిపిస్తుంది. ఇక ఉత్తరప్రదేశ్‌లో ఈ దఫా సీట్లు తగ్గి ఇండియా కూటమికి లబ్ధి చేకూరుతుందని చెబుతున్నారు. పశ్చిమబెంగాల్‌లో సీట్లు గెలిచినా బీజేపీ కన్నా తృణమూలే ఎక్కువ స్థానాలు గెల్చుకుంటుందన్న వాదన వినిపిస్తోంది. ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల్లో ఆప్ నేత కేజ్రీవాల్ అరెస్ట్ వల్ల ఆ పార్టీకి సానుభూతి కలిసి రావచ్చని అంటున్నారు. బీహార్‌లో బీజేపీ– నితీష్ కుమార్ కన్నా ఆర్జెడీ యువ నేత తేజస్వీ యాదవ్ కు క్రేజ్ విపరీతంగా పెరగుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇక సెవన్ సిస్టర్స్‌గా చెప్పుకునే ఈశాన్య రాష్ట్రా లపై మణిపూర్ అల్లర్లు ప్రభావం చూపే అవకాశం ఉందని, ఇది బీజేపీకి నష్టం చేసే అంశంగా రాజకీయ పండితులు చెప్తున్నారు. ఇలా ప్రతీ రాష్ట్రంలోనూ ఎంతో కొంత బీజేపీ బలం తగ్గవచ్చన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇందులో నిజానిజాలు ఎలా ఉన్నా. .. 2019 నాటి ఎన్నికల ఫలితాలు తిరిగి పునరావృతం కావడం కష్టమేనని చెబుతు న్నారు. ఏది ఏమైనా ఇప్పటికీ ప్రధాని మోదీకే దేశంలో ప్రధాన ఆకర్షణ కలిగిన నాయకుడిగా ప్రజలు గుర్తించడమన్నది నిర్వివాదాంశం.

# 5 రోజులు వానలే...వానలు



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : భారత వాతావరణ శాఖదేశ ప్రజలంతా ఊపిరి పీల్చుకునే శుభవార్త చెప్పింది. నైరుతి రుతుపవనాలు మరో ఐదు రోజుల్లో కేరళను తాకేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రకటించింది. కేరళను తాకిన తర్వాత సకాలంలో దేశమంతటా విస్తరిస్తాయని తెలిపింది. ఈసారి దేశంలో సాధారణం, సాధారణం కన్నా ఎక్కువ వర్షాలు పడతాయని పేర్కొంది.లానినో ప్రభావంతో ఈసారి ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో సాధారణం కన్నా ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అందకు అనుగుణంగానే రుతుపవనాల కదలిక ఉందని పేర్కొంది. భారత వాతావరణ శాఖ ప్రకారం కేరళలో రుతుపవనాలు ప్రవేశించే సమయంలో గత 150 ఏళ్లుగా మారుతూనే ఉంది. మొదటిసారి 1918లో మే 11నే రుతుపవనాలు కేరళను తాకాయి. అత్యంత ఆలస్యంగా 1972లో జూన్ 18న భారత దేశంలోకి ప్రవేశించాయి. ఇక గతేడాది జూన్ 8న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయిఇదిలా ఉంటే.. రానున్న ఐదు రోజులు పశ్చిమ తీరంతోపాటు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కోస్తాంధ్ర, తెలంగాణ, రాయలసీమ, కర్ణాటక రాష్ట్రాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. వాతావరణం చాలా వరకు చల్లబడుతుందని పేర్కొంది.ఇక ఉత్తర భారత దేశంలోని రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఢిల్లీలో వేడి తీవ్రత కొనసాగుతుందని ఐఎండీ తెలిపింది. ఈ నెలాఖరు వరకు ఈ రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది.

# కెనరా బ్యాంక్ లో బంగారం మాయం



వరంగల్, ప్రభాత సూర్యుడు : బ్యాంక్ అప్రైజర్ బంగారాన్ని కాజేసిన ఘటన ములుగు జిల్లాలో వెలుగు చూసింది. బ్యాంక్ ఆడిట్‌లో రెండు కిలోల బంగారం మాయం కావడాన్ని గుర్తించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలంలోని రాజుపేట కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లో బంగారం రుణాల్లో మోసాలను గుర్తించారు. బ్యాంక్ పరిధిలోని గ్రామాలకు సంబంధించిన రైతులు, వ్యాపారులు తమ తమ వ్యవసాయ, వాణిజ్య, వ్యాపార, వ్యక్తిగత అవసరాల నిమిత్తం బ్యాంకులో తమ బంగారం తనాఖా పెట్టుకుని రుణాలు తీసుకున్నారు. ఇలా బ్యాంకులో వివిధ వ్యక్తుల నుంచి రెండు కిలోలకు పైగా బంగారం బ్యాంకులో పోగైంది.నర్సంపేట నుంచి మంగపేట మండలంలోని పాలాయి గూడెంకు వలస వచ్చిన సమ్మెట ప్రశాంత్ అనే వ్యక్తి కెనరా బ్యాంక్ లో అప్రైజర్ గా పని చేస్తూ వచ్చాడు. ఆయన ద్వారా చాలామంది బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు.ఇటీవల కెనరా బ్యాంక్ రాజుపేట బ్రాంచ్ లో వార్షిక ఆడిట్ నిర్వహించారు. ఈ క్రమంలో ఖాతాదారులు గత ఏడాది కాలంలో తాకట్టు పెట్టిన బంగారం లెక్కలను కూడా సంబంధిత అధికారులు తీశారు. ఆడిట్ లెక్కలు చూస్తున్న అధికారులు అందులో ఉన్న రికార్డ్స్ చూసి ఒక్కసారిగా షాక్ అయ్యారు.బ్యాంకులో ఉన్న తాకట్టు లెక్కలకు, నిల్వలకు ఏమాత్రం పొంతన లేదు. దీంతో ఒకటికి రెండు సార్లు లెక్కలేసిన అధికారులు బంగారం గోల్ మాల్ జరిగినట్లు గుర్తించారు. వెంటనే విషయాన్ని బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.కంగారు పడిన మేనేజర్ వెంటనే బ్యాంక్ అప్రైజర్ సమ్మెట ప్రశాంత్ ను సంప్రదించేందుకు ప్రయత్నించాడు. అప్పటికే ప్రశాంత్ ఆ గ్రామం నుంచి భార్య, పిల్లలతో కలిసి ఉడాయించినట్లు గుర్తించారు. దీంతో బ్యాంక్ అప్రైజర్ ప్రశాంతే చాకచక్యంగా బంగారాన్ని కొట్టేసినట్లు నిర్ధారణకు వచ్చారు.బ్యాంకు నుంచి మాయమైన బంగారం దాదాపు 2 కిలోల 117 గ్రాముల వరకు ఉంటుందని అధికారులు నిర్ధారణకు వచ్చారు. దాని విలువ సుమారు రూ.1.44 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు మంగపేట పోలీస్ స్టేషన్ లో అప్రైజర్ ప్రశాంత్ పై బ్యాంక్ వరంగల్ రీజినల్ అసిస్టెంట్ మేనేజర్ పేరున ఫిర్యాదు చేశారు. బ్యాంకు రుణాలు మంజూరు చేసే సమయంలో అదనపు బంగారం లెక్కల్లో చూపించి మోసాలకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యవహారంలో బ్యాంకు సిబ్బంది పాత్రపై విచారణ జరుపుతున్నారు. అప్రైజర్‌తో కుమ్మక్కై మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.దీంతో ఎస్సై రవి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అప్రైజర్ ఏడాదిన్నర కాలంగా నర్సంపేట నుంచి వలస వచ్చి పాలాయిగూడెంలో ఓ ఇల్లు కొనుగోలు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. రాజుపేటలో గోల్డ్ షాప్ నిర్వహిస్తూ చుట్టు ప్రక్కల గ్రామస్తులందరిని మచ్చిక చేసుకొని కొందరి దగ్గరి నుంచి పెద్ద మొత్తంలో అప్పులు కూడా తీసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే అప్పుగా తీసుకున్న నగదుతో పాటు బ్యాంక్ బంగారం తో ఆయన పరారు కాగా స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. విషయం కాస్త బయటకు పొక్కడంతో ఖాతాదారుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR(V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215